గిరిజన గురుకులాలకు దరఖాస్తుల ఆహ్వానం

వ్యవసాయ యూనివర్సిటీ, ఏప్రిల్ 1 : తెలంగాణ రాష్ట్ర గురుకులాల ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థులకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సైనిక్ స్కూల్‌లో 2024-25 ప్రవేశానికి రాష్ట్ర వ్యాప్తంగా 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 7న ఆదివారం ప్రవేశ పరీక్ష ఉంటుందని, మరిన్ని వివరాలకు www.tgtugurukulam.telangana.gev.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ

కాచిగూడ, ఏప్రిల్ 1 : కేంద్ర ప్రభుత్వ అమోదిత నేషనల్ అకాడమి ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ కోర్సుల్లో ఆన్‌లైన్‌లో శిక్షణకు తెలంగాణ వ్యాప్తంగా ఆసక్తి గల యువతి, యువకుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు సంస్థ డైరెక్టర్ విమలారెడ్డి తెలిపారు. సోమవారం కాచిగూడలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. సెక్యూరిటీ ఆర్కిటెక్ట్, ఐటీ సెక్యూరిటీ విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీర్, పాలిటెక్నిక్, డిప్లొమా విద్యార్థులు ఈ నెల 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 7893141797, ఆన్‌లైన్‌లో www.nacsindia.org లో సంప్రదించవచ్చన్నారు.

వివిధ లా కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 1 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 18వ తేదీ నుంచి, ఎల్ఎల్ఎం మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 23వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఓయూ అధికారులు చెప్పారు.

లా కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని లా కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ అధికారులు తెలిపారు. ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ కోర్సుల మూడు, అయిదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను ఈ నెల 15వ తేదీ తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి, ఈ నెల 16వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 30వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

డిగ్రీ కోర్సుల రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

బీఏ, బీబీఏ, బీకామ్, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్ తదితర కోర్సుల మొదటి, మూడో, అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

ధాన్యం కొనుగోళ్లపై వీడియో కాన్ఫరెన్స్

మేడ్చల్, ఏప్రిల్1(నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సోమవారం ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేసవిలో తాగునీటి సరఫరా ప్రణాళిక, ధాన్యం కొనుగోలు, పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పనలపై నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పాల్గొన్నారు.

శిక్షణకు రాకుంటే షోకాజ్ నోటీసులు

మే 3 నుంచి 8వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఉద్యోగి ఫారం 12 నింపి సంతకం చేసి ఇవ్వాలి

హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల్లో అందరూ సమష్టిగా కలిసి పనిచేసి ఎన్నికలను విజయవంతం చేయాలని హైదరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పీఓ, ఏపీఓలకు ఇబ్రహీంబాగ్‌లోని వాసవి ఇంజినీరింగ్ కళాశాల, మలక్‌పేట, ఉస్మానియా యూనివర్సిటీ కోఠిలో ఏర్పాటు చేసిన శిక్షణా కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. శిక్షణకు ఎంత మంది హాజరయ్యారు? ఎంతమంది గైర్హాజరయ్యారు? శాఖల వారీగా గుర్తించి శిక్షణకు రానివారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఏఆర్ఓ జ్యోతిని కలెక్టర్ ఆదేశించారు. గత ఎన్నికలలో జరిగిన తప్పిదాలు మళ్లీ జరగకుండా శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అనుదీప్ తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్

భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ చెప్పారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగుల కోసం ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మే 3 నుంచి 8 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఫారం 12 నింపి సంతకం చేసి ఇవ్వాలని సూచించారు. సెక్టోరల్ అధికారులు పోలింగ్ కేంద్రాల్లో టాయిలెట్, తాగునీరు, కరెంట్ తదితర సౌకర్యాలు ఉండేలా చూస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఆర్వోలు, పీఓలు, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్ సక్సెనా..

కొవిడ్ టీకాతో అనేక దుష్ప్రభావాలు

99 మిలియన్ల మందిపై ప్రభావం

- బాధితుల వివరాలను ప్రభుత్వం సేకరించాలి
- బలవంతపు టీకా రాజ్యాంగ వ్యతిరేకం
- ఆవేకెన్ మూవ్‌మెంట్ ఇండియా

ఖైరతాబాద్, ఏప్రిల్ 1 : కొవిడ్‌తో పాటు ఇతర టీకాలు బలవంతంగా ప్రజలకు వేయడం రాజ్యాంగ వ్యతిరేకమని ఆవేకెన్ మూవ్‌మెంట్ ఇండియా ఆరోపిస్తున్నది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంస్థ ప్రతినిధులు డాక్టర్ ప్రవీణ్ సక్సెనా, ప్రొఫెసర్ భాస్కర్ రామన్, సరస్వతి కవుల, డాక్టర్ సుధా చెప్యాల మాట్లాడుతూ ఒక టీకా వేయాలంటే అన్ని రకాల ట్రయల్స్ పూర్తి చేసుకొని సురక్షితమైనదని నిర్ధారించిన తర్వాతే వేయాల్సి ఉంటుందన్నారు. కొవిడ్ టీకాను పూర్తి స్థాయిలో నిర్ధారించుకోకముందే కోట్లాది మందికి వేశారని అన్నారు. ఫలితంగా అనేక దుష్ప్రభావాలు వస్తున్నాయని, 99 మిలియన్ల మందికి ఈ ప్రభావం చూపినట్లు తమ అధ్యయనంలో తేలిందన్నారు. కొవిడ్ టీకాల దుష్ప్రభావాల బాధితుల వివరాలను సైతం సేకరించడం లేదని, దీని కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రభుత్వం రూపొందించాలన్నారు. అలాగే చిన్నారులకు సైతం ఇష్టారీతిలో టీకాలు వేయిస్తున్నారని, వాటికి ప్రామాణికత ఉందా లేదా అనే తెలుసుకోవాలని, ఇలాంటి వ్యాక్సినేషన్ వల్ల ఆటిజం, ఇతర జన్యు సంబంధిత వ్యాధులు కలుగుతున్నాయన్నారు. కొన్ని సంస్థలు తమ ఆర్థిక ప్రయోజనాల కోసమే మార్కెట్‌లోకి టీకాలను తీసుకువస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాల్నారు.

ఓటర్ల వివరాలకు టోల్ ఫ్రీ నంబర్

మేడ్చల్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు లోక్ సభ ఎన్నికల సందర్భంగా ఓటర్ల వివరాలను తెలుసుకునేందుకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో 1950 టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కంట్రోల్‌రూమ్‌లో సిబ్బంది, పోలింగ్ స్టేషన్ల నంబర్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఫారం 6, 7, 8 గురించి సంక్షిప్త సమాచారం, ఓటర్ ఐడీ, పోలింగ్ స్టేషన్, ఏబిక్ కార్డు, ఏఆర్ఓ, ఈఆర్ఒ, బీఎల్ఓ తదితర వివరాలు టోల్ ఫ్రీ నంబర్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు.



శిక్షణ కేంద్రంలో ఆర్వో , జిల్లా కలెక్టర్ శశాంక్, ఏఆర్వో , జడ్సీ స్నేహ

ఎన్నికల విధులపై సంపూర్ణ అవగాహన పొందాలి

ఆర్వో, జిల్లా కలెక్టర్ శశాంక్

మియాపూర్ , ఏప్రిల్ 1 : చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఎన్నికల విధుల్లో పాల్గొననున్న 751 పీవోలు, ఏపీవోలకు శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వెంకటేశ్వర ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తొలి రోజు శిక్షణకు 376 మంది పీవోలు , ఏపీవోలు హాజరయ్యారు. డీఎల్ఎంటీ, 11 మంది ఏఎల్ఎంటీలు ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. కాగా శిక్షణ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి(ఆర్వో) , జిల్లా కలెక్టర్ శశాంక్, ఏఆర్వో జడ్సీ స్నేహ సందర్శించారు. కేంద్రంలోని వసతులను పరిశీలించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆర్వో శశాంక్ మాట్లాడుతూ ఎన్నికల విధుల నిర్వహణలో పీవోలు, ఏపీవోలది అత్యంత కీలకమైన బాధ్యత అన్నారు. త్వరలో రెండో దశ శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు.

జిల్లా కోర్టు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా కోర్టులో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జిల్లా కోర్టుల ప్రాంగణంలో జరిగింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి గుర్రం సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు వై.కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గులగారి కృష్ణ, ఉపాధ్యక్షుడు పి.రాజేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి రాధాకృష్ణ, మహిళా కార్యదర్శి మీనాక్షి, కోశాధికారి కెరిత్ కుమారి, గ్రంథాలయ కార్యదర్శి రాములు, క్రీడా కార్యదర్శి అశోక్‌తో పాటు కార్యవర్గ సభ్యులు విజయ్ చంద్రకిరణ్, వంశీకృష్ణ, ప్రవీణ్‌కుమార్, రవి, సందీప్, శైలజ, స్వప్న ప్రమాణాసీకారం చేశారు. మాజీ అధ్యక్షుడు కొంగర రాజిరెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు గోకుల్ రామారావు, దన్వాడ మధుసూదన్‌రావు, ఎంపీ భార్గవ్, పుడ్ కమిషన్ సభ్యులు కొంతం గోవర్ధన్‌రెడ్డి, మాజీ పంచాయతీరాజ్ కమిషన్ సభ్యులు పులిగారి గోవర్ధన్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ బాచిరెడ్డి సాయిరెడ్డి, న్యాయవాద జేఏసీ నాయకులు మంత్రి రవీందర్‌రావు, పీఠం ప్రదీప్‌కుమార్, నర్సింగోజు నరేశ్ కుమార్, లింగం, జొన్నాడ రాకేశ్ కుమార్, విజయ్ నాయక్, మహిళా న్యాయవాదులు దీపికారెడ్డి, దేవరకొండ జ్యోతి, సుతారి స్వప్న, స్రవంతి, మాధవి, మానస, పాల్గొన్నారు.

నూతన అధ్యక్ష కార్యదర్శులను సన్మానిస్తున్న న్యాయవాదులు

ప్రైవేటు ట్యాంకర్లే దిక్కాయే..!

ఓ వైపు మండుతున్న ఎండలు.., మరో వైపు నీటి కొరతతో నగర వాసులు నరకం చూస్తున్నారు. జలమండలి నల్లాల ద్వారా అరకొరగా నీటి సరఫరా చేస్తుండటంతో పాటు జలమండలి ట్యాంకర్లను బుకింగ్ చేస్తే వారం రోజులైనా రావడంలేదు. దీంతో ఆయా కాలనీల వాసులు ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపురించింది. వర్షాలు పడే వరకు పరిస్థితి ఇలానే ఉంటుందేమోనని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. తాము పొద్దంతా కష్టపడి సంపాదించిందంతా ట్యాంకర్లకే పెట్టాల్సి వస్తుందని వాపోతున్నారు.

కూకట్‌పల్లిలో ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

పీవీ ప్రభాకర్‌రావును సన్మానిస్తున్న డాక్టర్ తనుగుల జితేందర్ రావు

పీవీఎన్ కుమారుడికి సన్మానం

చిక్కడపల్లి, ఏప్రిల్ 1 : మాజీ ప్రధాని, భారత రత్న అవార్డు గ్రహీత స్వర్గీయ పీవీ నరసింహారావు వ్యక్తి కాదని ఒక శక్తి అని, చరిత్రను తిరగరాసిన మహా వ్యక్తి అని ఆయన కుమారుడు పీవీ ప్రభాకర్ రావు అన్నారు. పీవీ నరసింహారావుకు భారత దేశ ప్రభుత్వం ప్రకటించిన భారత రత్న అవార్డును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పీవీ ప్రభాకర్ అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం టీవైజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ తనుగుల జితేందర్ రావు ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులు ప్రభాకర్ రావును కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీవైజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ తనుగుల జితేందర్ రావు, పీవీ ప్రభాకర్ కుమార్తె దివ్య, యూనియన్ నాయకులు, ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణయాదవ్ కుటుంబానికి ఆర్థిక సాయం

బేగంపేట్ ఏప్రిల్ 1: బేగంపేట్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కృష్ణయాదవ్ కుటుంబసభ్యులకు ట్రాఫిక్ పోలీసులు చేయూతనందించారు. సోమవారం బేగంపేట్ ట్రాఫిక్ ఇనిస్టిట్యూట్ సెంటర్‌లో కృష్ణయాదవ్ కుటుంబసభ్యులకు ట్రాఫిక్ డీసీపీ సుబ్బారాయుడు చేతుల మీదుగా రూ. 2,50,000 లకు సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అదనపు డీసీపీ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

జలమండలి ఉద్యోగుల పదవీ విరమణ

సిటీబ్యూరో, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ) : జీవితంలో పదవీ విమరణ అనేది ఒక ముఖ్యమైన ఘట్టమని ఎండీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. జలమండలి పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు జనరల్ మేనేజర్లు సహా 16 మంది ఉద్యోగులకు పదవీ విరమణ కార్యక్రమం సోమవారం ఖైరతాబాద్ సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, ఆపరేషన్స్ డైరెక్టర్ స్వామి, విజయరావు, సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, జీఎం సరస్వతి ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు బీసీల సత్తా చూపుతాం

పార్లమెంట్ ఎన్నికల్లో రెడ్డి సామాజిక వర్గానికే అధిక సీట్లు

- బీసీ సామాజిక వర్గాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్‌కు బుద్ధిచెబుతాం
- 7న బీసీల రాజకీయ విస్తృత స్థాయి సమావేశం
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

కవాడిగూడ, ఏప్రిల్ 1 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలన పేరుతో కులపాలన కొనసాగిస్తున్నదని, అన్ని రకాల పదవులను రెడ్డి సామాజిక వర్గానికి కల్పిస్తూ బీసీ సామాజిక వర్గాన్ని విస్మరిస్తున్నదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. సోమవారం దోమలగూడలోని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యాలయంలో జరిగిన బీసీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు సగం పార్లమెంట్ స్థానాలను బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీసీల సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. బీజేపీ 17 పార్లమెంట్ స్థానాల్లో బీసీలకు 5, బీఆర్ఎస్ 6 టికెట్లు కేటాయిస్తే కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు 13 మంది అభ్యర్థులను ప్రకటిస్తే అందులో బీసీలకు కేవలం 3 టికెట్లు మాత్రమే ప్రకటించిందని, ఇది అత్యంత దారుణమని మండిపడ్డారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీసీల రాజకీయ భవిష్యత్తుపై చర్చించి రాజకీయ కార్యాచరణ రూపొందించడానికి, బీసీల విధివిధానాలపై చర్చించడానికి ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లోని వందలాది మంది బీసీ సంఘాల ప్రతినిధులతో బీసీల రాజకీయ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశా చారి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రం గౌడ్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి.మని మంజరి సాగర్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేశ్‌యాదవ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్, నాయకులు సమతాయాదవ్, ఇంద్రం రజక, మహేశ్ మేరు, తదితరులు పాల్గొన్నారు.

రియల్ వ్యాపారి ఆత్మహత్య

బీజేపీ కార్పొరేటర్‌పై కేసు నమోదు

మన్సూరాబాద్, ఏప్రిల్ 1 : ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో తలెత్తిన వివాదంలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి మానసిక వేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కార్పొరేటర్‌తో పాటు మరో మహిళ వేదింపులకు గురి చేయడంతోనే తన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడంటూ మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగోల్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన చెమ్మల బలవర్ధన్‌రెడ్డి (36) ప్రస్తుతం నాగోల్, జైపురికాలనీ, శ్రీనివాసకాలనీలో నివాసముంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. బలవర్ధన్‌రెడ్డికి భార్య అంజలి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే బలవర్ధన్‌రెడ్డికి భాగ్య అనే మహిళతో ఆర్థిక లావాదేవీలు ఉన్నా యి. భాగ్య పక్షాన బీజేపీ పార్టీకి చెందిన గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి తరచూ బలవర్ధన్‌రెడ్డికి ఫోన్ చేసి డబ్బులు ఇవ్వాలంటూ బెదిరింపులకు గురి చేస్తున్నాడు. గత నెల 30న కొందరు వ్యక్తులను ఇంటి మీదకు పంపించాడు. దీంతో మనస్తాపం చెందిన భార్య పిల్లలతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లింది. ఆదివారం ఉదయం మరోసారి భాగ్యతో పాటు మరి కొందరు వ్యక్తులు బలవర్ధన్‌రెడ్డి ఇంటికి వచ్చి గొడవకు దిగారు. ఇదిలా ఉండగా ఆదివారం మధ్యాహ్నం అంజలి తన భర్తకు ఫోన్ చేయగా ఎంతకీ లిఫ్ట్ చేయలేదు. స్థానికులు ఇంటికి వెళ్లి చూడగా బలవర్ధన్‌రెడ్డి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడి కనిపించాడు. గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి వేదిస్తున్నాడని, భాగ్య సైతం లైంగిక దాడి కేసు పెడతానంటూ సూసైడ్ నోట్‌లో రాశాడని తెలిపింది. ఈ మేరకు నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.